క్లుప్తంగా

వెంకటేశ్వరుడికి పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో కొలువైన ములక పోలేరమ్మ ఆలయ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. ఆలయ చైర్మన్ పెనుమల్లి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శివాలయం చైర్మన్ చెన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బత్తిన రవీంద్రరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శత జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు కొప్పుల మస్తానయ్య, చీమల వెంకటరమణయ్య, ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు అల్లం మస్తానయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు వన్నెపంట బాల రాఘవరెడ్డి, సన్నపురెడ్డి అంకిరెడ్డి, మాటేటి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి



బీసీ సమన్వయ కమిటీ సమావేశంలో నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : గ్రామస్థాయిలో బీసీ కులాలు ఐక్యంగా ఉండాలని బీసీ సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ బీసీ సమన్వయ కమిటీ జిల్లా సమావేశం ముత్తుకూరు రోడ్డులోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. ఇందులో జిల్లాలోని 24 బీసీ కులాల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్ బుధవరపు బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా పరిశీలకుడు ధరణికోట లక్ష్మీనారాయణ జిల్లాలో బీసీ కులాల ఐక్యతను బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యాచరణ ప్రణాళికపై దిశా నిర్దేశం చేశారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల కమిటీలను ప్రతి బీసీ కులం నుంచి ఒక్కో కన్వీనర్‌ను ఎన్నుకొని నియోజకవర్గ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. ఆయా కమిటీల ద్వారా అన్ని బీసీ కులాలను సంఘటితం చేసుకొని మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ భాస్కర్‌గౌడ్, బీసీ నాయకులు వెంకట్రావ్, దుర్గంపాటి పద్మజ, జిల్లా విశ్రాంత న్యాయమూర్తి సంజీవయ్య, ఇరగరాజు శ్రీనివాసరావు, సోమగోపాల్, మన్నెం రాముగౌడ్, నల్లబోతుల వెంకటేశ్వర్లు, అల్లం రమణయ్య ఆచారి, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పరమాచార్యులు ఆరాధన ఉత్సవం నేడు

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో 'పరమాచార్యుల ఆరాధన ఉత్సవం' గురువారం సాయంత్రం 6 గంటలకు జరుగనుందని నిర్వాహకుడు స్వామి సమయానంద నాథ బుధవారం తెలిపారు. ఆదిశంకర ధ్యానమందిర కమిటీ, చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఆరాధన ఉత్సవంలో పరమాచార్యుల జీవిత విశేషాలు, శంకరాచార్య విరచిత శివానంద లహరి శ్లోకాలను అగస్త్యరాజు వెంకటసుబ్బారావు విశ్లేషిస్తారన్నారు. భక్తులు పాల్గొ ని తీర్థ ప్రసాదాలు స్వీకరించి పరమాచార్యుల వారి అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు.

ఇండోర్ స్టేడియం సందర్శన

నెల్లూరు(బారకాసు) : నగరంలోని మాగుంట లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బుధవారం సందర్శించారు. తొలుత ఆయన్ను స్టేడియం నిర్వాహకుడు దేవళ్ల రాకేష్ సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నేత వైవీరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్



కోవూరు : పడుగుపాడు సెంటర్‌లో బియ్యం పంపిణీ



కోవూరు : పడుగుపాడు సెంటర్‌లోని చర్చిలో నాటక ప్రదర్శన

మనుబోలు: క్రిస్మస్ పర్వదినాన్ని నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.

➡ మనుబోలు దళితవాడలోని చర్చిని విద్యుద్దీపాలతో అలరించారు. ప్రత్యేక ప్రార్థనలను పాస్టర్ పీటర్‌పాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

➡ కోదండరామపురం, కాగితాలపూరు, కొమ్మలపూడి, బద్దెవోలు, వెంకన్నపాళెం, కొలనకుదురు, చెర్లోపల్లి, పిడూరు, జట్లకొండూరు, గురివిందపూడి, అక్కంపేట, కుడితిపల్లి తదితర గ్రామాల్లో పాస్టర్లు లాజరస్, ఫ్రాంక్లిన్, తిమోతి, ఎలీషా, శేషయ్య తదితరులు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.

➡ పలు చర్చిల్లో సుమారు వెయ్యి మందికి మిఠాయిలను పంపిణీ చేశారు. సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సూచనలతో కార్యక్రమాన్ని చేపట్టారు.

పొదలకూరు: పట్టణంలోని జాన్‌జాకబ్ లూథరన్, క్యాథలిక్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక గీతాలను ఆలపించారు. పట్టణంలోని లూథరన్ చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు.

తోటపల్లిగూడూరు: కోడూరు సాగర తీరాన కొలువైన వేళాంగణిమాత పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలను దైవ సేవకులు, చర్చి డైరెక్టర్ లూకాస్‌రాజ్ నిర్వహించి భక్తులకు దైవసందేశమిచ్చారు. వేళాంగణి మాతకు దివ్యబలి పూజ చేశారు. అనంతరం కోడూరు సాగర తీరంలో సముద్ర స్నానాలను భక్తులు ఆచరించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

➡ నరుకూరులోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 200 మంది పేదలకు వీటిని అందజేశారు. చర్చి పెద్దలు సాదేపల్లి బోయదాస్, సాదేపల్లి బాలప్రసాద్, దువ్వూరు కోటేశ్వరరావు, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ కరేటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పిడతాపోలూరు, ముత్తుకూరు, వల్లూరు, కృష్ణపట్నం, పైనాపురం, నేలటూరు, పంటపాళెం, దొరువులపాళెం, డమ్మాయపాళెంలోని చర్చిల్లో నిర్వహించిన ప్రార్థనలకు భారీగా హాజరయ్యారు. భక్తి గీతాలను ఆలపించారు. అన్నదానంతో పాటు వస్త్రాలను పంపిణీ చేశారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చి నగర పంచాయతీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏడు ప్రధాన చర్చిల్లో ప్రార్థనలు మిన్నంటాయి. మండలంలోని రేబాల, కాగులపాడు, పెనుబల్లి, మినగల్లు, వవ్వేరు, పురంధరపురం, నాగాయగుంట గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో ఏసు ప్రభువు జననాన్ని కీర్తిస్తూ గీతాలు ఆలపించారు.

➡ **కోవూరు :** మండలంలోని పోతిరెడ్డిపాళెంలో ఉన్న సెంటినరీ చర్చిలో మంగళవారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. పడుగుపాడులోని బేతనియ చర్చిలో సంఘకాపరి మాణిక్యరావు ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. అలాగే పడుగుపాడు సెంటర్‌లో ఉన్న డ్యునామిస్ చర్చిలో సంఘ కాపరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. అలాగే పోతిరెడ్డిపాళెంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ బి.సల్మాన్‌రాజు, లీలమ్మ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. దీంతో పాటు భక్తి గీతాలు ఆలపించారు. పలువురు చిన్నారులకు బహుమతులు అందజేశారు. పేదలకు బియ్యం, దుప్పట్లు అందించారు. ఆయా కార్యక్రమాల్లో మధు, సునీత, అభినయ, అమూల్య, యశ్వంత్, మురళి, బిందు, ఆరాధ్య, మంజుల, ప్రదీప్, అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

➡ **ఇందుకూరుపేట :** మండలంలోని ఇందుకూరుపేట, కొత్తూరు, పల్లిపాడు, ముదివర్తిపాళెం, నిడిముసలి, కుడితిపాళెం, గంగపట్నం, మైపాడు, నరసాపురం, కొరుటూరు, సోమరాజుపల్లి, కొమరిక తదితర గ్రామాల్లో క్రిస్మస్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ముత్తుకూరు: పిడతాపోలూరులో..



బుచ్చిరెడ్డిపాళెంలో విద్యుద్దీపాలంకరణలో చర్చి



బుచ్చిరెడ్డిపాళెం : వవ్వేరులో..



మనుబోలు: మిఠాయిల పంపిణీ



పొదలకూరులో..



తోటపల్లిగూడూరు: వేళాంగణిమాత పుణ్యక్షేత్రంలో..



మనుబోలు: ప్రత్యేక ప్రార్థనలు



కోవూరు : విద్యుద్దీపకాంతుల్లో సెంటినరీ చర్చి



తోటపల్లిగూడూరు: నరుకూరు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో దుప్పట్ల పంపిణీ



కోవూరు : పోతిరెడ్డిపాళెంలోని కల్వరి చర్చిలో..



కోవూరు : భక్తిగీతాలు ఆలపిస్తున్న సంఘస్తులు

దైవ సన్నిధికి మార్గాలు వేరైనా గమ్యం ఒక్కటే



కేక్‌ను కట్ చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: దైవ సన్నిధికి మార్గాలు వేరైనా గమ్యం ఒక్కటేనని, ఏ మతాల వారైనా ప్రార్థనలు చేసేది మోక్షం కోసమేనని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు ఎమ్మార్వో కాలనీలోని చర్చిలో జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ తల్లి, దైవజనురాలు లలితాప్రసాద్‌తో కలిసి కేక్‌ను బుధవారం కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెనాలి నిర్మలమ్మ కుటుంబం తనకు సెంటిమెంట్‌గా మారిందన్నారు. అన్ని మతాలను తాను గౌరవిస్తానని చెప్పారు. అనంతరం పేదలకు కాకాణి చేతుల మీదుగా వస్త్రాలను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీకల్యాణి, పులి వెంకటేశ్వర్లురెడ్డి, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, అంజద్, వేణుగోపాల్‌రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలులో అపరిచితుడి హల్‌చల్

మనుబోలు: స్థానిక పడమటి వీధిలో ఓ అపరిచితుడు మంగళవారం హల్‌చల్ చేశాడు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో పడమటి వీధిలోని కాంద్ర నరసారెడ్డి ఇంటి గోడ దూకుతుండగా, గమనించిన వారు ఫోన్లో సమాచారం చేరవేశారు. దీంతో చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి అపరిచితుడ్ని వెంబడించారు. బస్టాండ్ సమీపంలోని ఓ ఇంటి డాబాపై దాక్కొని ఉండగా, పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. విచారించిన పోలీసులు బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. రైల్లో వెళ్తూ, మతిస్థిమితం సక్రమంగా లేక మనుబోలులో దిగి నాలుగు రోజులుగా చుట్టుపక్కల సంచరిస్తున్నాడని తెలిపారు. అతని కుటుంబసభ్యులతో మాట్లాడి తిరిగి రైల్లో బిహార్ పంపారు. కాగా మనుబోలులో నిఘాను రాత్రి వేళ పోలీసులు పటిష్టం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇందుకూరుపేటలో రక్తదాన శిబిరం

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ నేత, ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు గునపాటి సురేష్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా మండల కేంద్రమైన ఇందుకూరుపేటలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జీఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో తొలుత గ్రామంలో బైక్ ర్యాలీ చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. నాయకులు గురజాల బుజ్జిబాబు, భానుచంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.



వీడని ముసురు

ముత్తుకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో తీరప్రాంత గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నాయి. పొగ మంచు, ముసురు కారణంగా పల్లెలు చలితో వణికిపోయాయి. గంగపుత్రులు సముద్రంలో చేపల వేట చేయలేని పరిస్థితి ఏర్పడింది. సముద్రం కసురుగా మారింది. దీంతో నేలటూరు, కృష్ణపట్నం గ్రామాల్లో పడవలు, వలలను తీరంలోనే కట్టేశారు. సాయంత్రం ఐదు గంటలకే చీకట్లు కమ్ముకున్నాయి.

కసురుగా సముద్రం

ఇందుకూరుపేట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రం కసురుగా ఉంది. అలలు మోస్తరుగా ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి చలిగాలులు వీస్తున్నాయి. కాగా ఎడతెరిపిలేని చిరుజల్లులతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ముత్తుకూరు : నేలటూరు తీరంలో కట్టేసిన పడవలు

సొంత భవనాలెప్పటికో..?

• అద్దె గృహాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు
• సిబ్బంది, చిన్నారుల ఇక్కట్లు



ముంగళదొరువులో శిథిలావస్థకు చేరిన భవనానికి పైపై మెరుగులు

తోటపల్లిగూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కార్పొరేట్ తరహాలో ప్రీ స్కూల్, ఎల్కేజీ, యూకేజీ చదువులను అందిస్తున్నామని చెప్తున్న ప్రభుత్వ మాటలు నీటిమూటలేనని తేలిపోతోంది. సొంత భవనాల్లేక ఓ వైపు.. ఉన్న అరాకొర భవనాల్లో కనీస సౌకర్యాలు కరువై కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. మండలంలోని తోటపల్లిగూడూరు, నరుకూరు, పేడూరు సెక్టార్ల పరిధిలో 82 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా సుమారు 1580 మంది చిన్నారులు పౌష్టికాహారాన్ని పొందుతుంటడమే కాకుండా ఆటపాటలతో కూడిన విద్యను అందుకుంటున్నారు. అయితే ప్రభుత్వ భవనాల కొరత కారణంగా చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

22 కేంద్రాలకే సొంత భవనాలు

మండలంలోని 82 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 22 కేంద్రాలకే సొంత భవనాలున్నాయి. 36 కేంద్రాలు అద్దె భవనాల్లో.. మిగిలిన 24 కేంద్రాలు పాడుబడిన పంచాయతీ భవనాలు, తుఫాన్ షెల్టర్లలో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు రూ.రెండు వేలను ప్రభుత్వం చెల్లిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో ఇళ్ల అద్దెలు రూ.3500 నుంచి రూ.4500 పలుకుతున్న ఈ రోజుల్లో ప్రభుత్వం అందిస్తున్న రూ.రెండు వేలు ఏ మూలకూ సరిపోవడంలేదు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అరాకొర నిధులకు మంచి ఇళ్లు దొరకడం లేదు. ఒక వేళ దొరికినా కనీస సౌకర్యాల్లేక చిన్నారులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ప్రమాదభరితంగా..

అద్దె భవనాలు లభ్యం కాని చోట పాడుబడిన పంచాయతీ భవనాలు, తుఫాన్ షెల్టర్లే కేంద్రాల నిర్వహణకు దిక్కవుతున్నాయి. శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారిన ఈ భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు తమ చిన్నారులను పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. మరోవైపు ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో 20 మంది చిన్నారులకు గానూ పది మంది కూడా ఉండటంలేదు. సొంత భవనాలను నిర్మించి చిన్నారుల సంక్షేమానికి పాటుపడాల్సిన పాలకులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

నూతన అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. కొన్ని పంచాయతీల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు సంబంధించి స్థల సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో నూతన భవనాలు మంజూరైనా నిర్మించలేని పరిస్థితి తలెత్తుతోంది. సమస్యలను అధిగమించి నిర్మించేందుకు కృషి చేస్తున్నాం.

– రంగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తోటపల్లిగూడూరు



శిథిలావస్థలో ఉన్న కృష్ణారెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్ర భవనం



చిన్నచెరుకూరు దళిత కాలనీలో అసంపూర్తిగా ఇలా..